# తగిన శాస్తి

రచన:
శ్రీ అంగజాల లక్ష్మణరావు



ట్యూషన్నుండి యిల్లుచేరుకునే సరికే తొమ్మిదిముప్పావు అయింది, గబగబా రెండు' మెతుకులుతిని, ఆదరా బాదరాగా డ్రెస్సేసుకుని ఎకా ఎకీని స్కూలుకు బయలుదేరాను. దార్లో లక్ష్మికేఫ్‌దగ్గర కిల్లీ, సిగరెట్ బిగించి టింగ్‌రంగాలాగ తయారై స్కూలుమాటే మరచి Gas కొట్టేస్తున్నాడు చిరకాల మిత్రుడు మురళి. ఏమిటో ఈ డాబుల రాయుడు కోసేస్తున్నవన్నీ చెవులు రిక్కించి వింటున్నారు చుట్టూచేరిన ప్రజలు. నన్ను మాత్రం వాడు చూడకపోయినందుకు మనసులో సంతోషించుకుని నేనూ చూడనట్టే తప్పించుకుని నడవసాగాను. దానికైనా కారణం లేకపోలేదు. వాడు పక్కారౌడీ. ఆ మాట స్కూల్లో ప్రతివాడికీ తెలుసు. వాడితో తిరిగితే ఉన్న కాస్త మర్యాద పోతుందని నాకూ తెలుసు. ఇంతకీ యింతవరకు వాడు నాకు చేసిన అపకారమేమీ లేకపోయినా, ఇతరుల్ని యేడిపించి, అవసరమైతే వంచించి సంతోషపడడం వాడికో సరదా. పైగా పెద్ద ఘనకార్యం చేసినట్టుగానే ఆనందిస్తాడు. వాడొక్కడేకాదు. అలాంటి వాళ్లనేకమంది ప్రస్తుతపు దినాల్లో చలామణీ అవుతున్నారంటే అతిశయోక్తిలేదేమో. నిర్లక్ష్యం, నిర్భయం, వాళ్ల కళ్లల్లో లీలగానైనా అగుపిస్తాయి. తమ అఖండమైన తెలివితేటల్తో లోకాన్నే మరమ్మత్తు చేయాలనుకుంటారు. అది కేవలం అవివేకమనే విషయాన్ని అణుమాత్రమైనా గుర్తించినట్టు కనపడరు. ఇక యిలాంటి ఆత్మస్తుతి పరాయణుల వెనుక యిష్టంలేకపోయినా భళాభళి అని తిరిగే తందానతానరాయుళ్లు కొందరుంటారు. ఇక వీరంతా స్టూడెంట్స్ అనే తమకున్న ఒకే ఒక బిరుదుతో, నిర్లక్ష్యాన్ని సూచించే చూపుల్తో బీచ్‌లకు, సినిమాలకు ఇంకా ఇంకా అనేకచోట్లకు గాలిషికార్లు చేస్తుంటారు. ఖర్మంచాలక దార్లో ఎవరైనా కాస్త టిప్‌టాప్‌గా డ్రెస్సేసుకునే వన్నెల విసనకర్ర కనపడిందంటే ఉబ్బితబ్బిబ్బైపోయి, అందులో లీడర్ అనిపించుకునేవాడు తప్పు అని మనస్సు ఓ పక్కనించి మొరపెడుతున్నా వినిపించుకోకండా, తోటివాళ్లలో తనను మించిన గొప్పవాడు మరెవడూ లేడని వ్యక్తం చేయడం కోసం చిన్న చిట్కా విసురుతాడు. దాంతో మేం మాత్రం ఏం తక్కువవాళ్లమా అన్నట్టు చుట్టూవున్న అపరావతారాలంతా తలోమాట అంటారు. అయితే అందులో పరకాంతల్ని స్వంతతల్లులాగ చూసుకోవాలనే గాంధీగారి సూక్తుల్ని అక్షరాలా ఆచరించే శుద్ధబుద్ధిమంతు లుండకపోయినా, ఏదో పోనిస్తూ వాళ్లజోలి మనకెందుకనుకునే తటస్థపరులిద్దరో ముగ్గురో ఉండకపోరు. అయినా తమకొచ్చిందీ, తోటివాళ్లకు నచ్చిందీ, ఒక మాటైనా అనకపోతే, తోటివాళ్లు తననో అప్రయోజకుడనేస్తారేమోననే చచ్చు అభిప్రాయం బుర్రలోకి రావడంతో వాళ్ళూ ఒకమాట అనందే ఉండలేరు. పోతే ఆదారంట వెళ్లే అమ్మాయి అనవసరంగా రసాభాస పడపలసి వస్తుంది కదా అని నిమిత్తమాత్రంగా వెళ్లిపోతుందా, ఇహ చూసుకోండి మనవాళ్ల Greatness ఆహా! నేను విసిరేమాటకి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరై ఓరచూపుల్తో ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ వెళ్లిపోయిందని ఒకడు, అది నన్ను చూసేనని యింకొకడు, ఒకటేమిటి? పబ్లిక్‌రోడ్డుమీద పక్కని మనుషులున్నారనే సంగతి కూడ మర్చిపోయి ఉబ్బి తబ్బిబ్బైపోయి నోటికొచ్చినట్టల్లా కోసేస్తుంటారు. లేదూ! ఆమే కొంచెం పెంకిఘటమై బుర్ర తిరిగిపోయేలాగ ఒక్క శాపనార్థం పెట్టిందంటే రెండో కంటికి తెలియకుండా ఎవడిమట్టుకువాడే దొరికిన సందులోకి జారుకుని పలాయనం చిత్తగిస్తారు. ఇంతా జరిగాక ఊరుకుంటారా? మర్నాటినుంచీ మళ్లీ యిదే బిజినెస్ ఏమిటో ఆ ఘనత?

అదుగో! అలాంటి మహానుభావుల్లో ఉత్తమ శ్రేణికి చెందినవాడే మన మురళి. నేను తప్పుకోవడానికి కారణంకూడ అదే. అయినా మనవాడు విడిచిపెడ్తేకదూ? ఏ పక్కనించి వచ్చాడో "సత్యం" అని కేకేశాడు. మనకి అమాంతంగా హార్ట్ ఆగినంతపనైంది. అయినా వెంటనే తేరుకుని వినపడనట్టే గబగబా నడవడం మొదలుపెట్టేను. మరీ దగ్గరగా వచ్చి ఆగరా బ్రదర్! నేనూ వచ్చేస్తున్నా అనడంతో ఆగక తప్పిందికాదు. అప్పటికే స్కూలువచ్చేయడంతో మరేం మాట్లాడలేదు. తిన్నగా వెళ్లి క్లాసులో కూర్చున్నాం.

ఫస్ట్ పీరియడ్‌మాత్రం అంతా నిశ్శబ్దంగా కూర్చున్నాం. సెకండ్ పీరియడ్ లెఖలు మేష్టారు లేకపోవడంతో ఊరికే గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవలసివచ్చింది. అందులోనూ ఆడపిల్లలబెంచీ మా బెంచీకి ముందుగానే వుంది. కాలుచాపితే చాలు, చచ్చే చిక్కు. మా కాళ్ళు వాళ్లకి తగలక తప్పవు. చెప్పానుగా, మనవాడు మొదటే రౌడీరకమని. తన చెప్పుల్ని కాస్త ప్రయత్న పూర్వకంగానే

ముందువరుసలో కూర్చున్న సుగుణ కాళ్ల దగ్గరగా అంటే తనకి అందకుండా ఉండేటట్టుగా తోసేశాడు. క్లాస్ అంతా నిశ్శబ్దంగా వుంది. కొంచెంసేపయినతర్వాత మనవాడు ఏమీ ఎరగనట్టు అనెస్ట్‌గా నిల్చుని సుగుణనుద్దేశిస్తూ సీరియస్‌గా "ప్లీజ్! దయచేసి కాస్త కాలు యెత్తుతారా? చెప్పులున్నాయి తీసుకోవాలి. లేదా। దయయుంచి మీరు యిచ్చినా నరే" అన్నాడు. దాంతో ఆపుకోవాలనుకున్నా ఆగకపోవడంతో క్లాస్ అంతా గొల్లుమన్నారు. పాపం! ఆ అమ్మాయికి తల కొట్టేసినంత పనైంది. చచ్చేసిగ్గుతో మారుమాటాడకుండా "తీసుకోండి" అంటూ సీట్‌లోంచి లేచిపోయి మళ్లా బుర్రవంచుకుకూచుంది. మనవాడు పెద్ద ఘనకార్యంచేసినట్టు ఒక్కసారి క్లాస్ అంతా కలయజూసి, చిన్న స్మైల్ విసిరేశాడు. థర్డ్‌పీరియడ్ మాష్టారు రావడంతోటే రిపోర్టుచేస్తుందేమో నని భయపడ్డాం గాని, అందుకు తగిన ఆస్కారం లేకపోవడంతో ఆమె నొక్కినపేనులాగ కూర్చోవలసివచ్చింది. కాని, వీణ్ణి ఎప్పుడు ఇన్‌సల్టుచేద్దామా అనే దృఢనిశ్చయంమాత్రం కళ్లలో వ్యక్తమౌతూనే వుందనే నంగతి ఇంతో అంతో అనుభవశాలులైతే తప్ప గ్రహించలేరు. నాలుగో పీరీడ్ లీషర్. కాఫీతాగడానికి, దమ్ముకొట్టుకోడానికి నిర్ణయించుకునేచోట్లకి ఒక్కొక్కరే పోతున్నారు. నేనుమాత్రం కాస్త హోమ్‌వర్కు ఉందికదా అని చేసుకుంటూ కూర్చున్నాను. బాలికలంతా గ్రూప్‌గా లైబ్రరీలోకి వెళ్ళారు. ఆ అదను చూసుకుని మనవాడు "పదభాయ్! అలా లైబ్రరీకిపోయి షేక్స్‌ఫియర్స్ నోట్స్ తెచ్చుకుందాం" అని నన్ను లేపాడు, వాడు ఎందుకు పిలుస్తున్నాడో నాకు తెలుసు. ఏదో "వీడికి తగినశాస్తి జరగందే నిద్రపోదురా" అనుకున్నాను మనసులోనే, ఇష్టంలేకపోయినా తమాషా చూద్దామని వాడితోకూడ బయలుదేరాను.

మా క్లాస్‌మేట్స్ నలుగురూ, లైబ్రరీలో రౌండ్‌టేబిలుపై కూర్చుని చర్చసాగిస్తున్నారు. బహుశః ఇందాక జరిగిన సంఘటన గురించే అనుకుంటాను. మేము లోపలికి వెళ్లడంతో ఎక్కడివాళ్లక్కడ గప్‌చిప్‌గా ఊరకున్నారు. నాకేం నిమిత్తం లేదన్నట్టుగా నేనుమాత్రం ఓ పక్కగా వెళ్లి షేక్స్‌పియర్స్ నోట్స్‌కోసం వెతుకుతున్నాను. మనవాడు సీరియస్‌గా వాళ్లదగ్గరగావున్న కుర్చీలో కూర్చుని ఆలోచించి .ఏదో పుస్తకంతీసి కొంచెంసేపు చదివి, వాళ్లు తనవేపే చూస్తుండడం గమనించి పుస్తకంలో లేనిదాన్నే చమత్కారంగా చదవడం ప్రారంభించాడు—"రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ—ఎంత చక్కని పేర్లు? ఏమి వారి జగన్మోహనాకారము!! వారి అంద చందములను చూచి, విశ్వామిత్రుడు ముగ్ధుడై...." అని తన్మయత్వంతో సుగుణకి కొంచెం దగ్గరగా జరిగి అంతట...." అని యింకేవేవో అనబోతుండగా సుగుణ అందుకుని "మేనక నడుము బిగించి, చేతులు దులుపుకొని, విశ్వామిత్రుని చెక్కిళ్ళు కందునట్లు చాచి ఒక్క లెంపకాయ కొట్టెను" అంటూ చంప ఛడీలుమన్నట్టు మనవాడి బుగ్గమీద కసితీర ఒక్క లెంపకాయ ప్రసాదించింది. దాంతో మనవాడి ముఖం కందగడ్డలా తయారై శరీరంలో చైతన్యంలేకుండా, చేతులలో పట్టు వదిలిపోగా, "హతోస్మి" అనుకుంటూ శవంలాగు వాలుకుర్చీలో చేరగిలబడిపోయాడు. ఇక వాడ్ని సముదాయించి, కష్టపడి కుర్చీలోంచి లేవదీసి యింటిదగ్గర దిగబెట్టి వచ్చేసరికి నాకు తలప్రాణం తోకకొచ్చింది, మీకు చెబితే అబద్ధం అంటారేమో మర్నాటినుంచీ వాడు ఆడపిల్లలజోలికి వెడితే ఒట్టు.

★




మీరు కోరినవన్నియు సమకూడును



నమ్మకాన్ని విడవకండి! మీకార్యములన్నియు సమకూడును!! ఆశలన్నియు నెరవేరును!!! సూర్యచంద్రగ్రహణములలో పరిశుద్ధము చేయబడినది. ఈ మాంత్రిక ఉంగరమును ధరించినచో మీరు ప్రేమించిన ఏ స్త్రీ యయినను ఎంతదూరంలో ఉన్నదయినను, మీ పాదాక్రాంతమై మీరు చెప్పినటుల చేయుటకు సిద్ధపడుదురు. అన్ని అడ్డంకులను, విరోధములను జయించి మీరు ప్రేమించినవారినే పెండ్లిచేసుకొనవచ్చును. వ్యవహారములు, వర్తకము, చేతిపనులు, పరీక్ష మున్నగువానిలో విజయమును పొందవచ్చును. చెడ్డగ్రహములవలన యేర్పడునట్టి దుష్ఫలితములు మారి అదృష్టదేవతానుగ్రహమునకు పాత్రులు కాగలరు. దీర్ఘాయువు, ఎనలేని అయిశ్వర్యము, శాంతి సమాధానములతో జీవింపగలరు.



| | |
|---|---|
| మాంత్రిక ఉంగరము ఖరీదు | 1—15—0 |
| స్పెషల్ ఉంగరము | 3— 0—0 |
| స్పెషల్‌శక్తిని పొందినది | 3—15—0 |

విద్యుద్వేగములో ఫలితమిచ్చునది. ఫలితములేనిచో ఉంగరము ఖరీదు వాపస్. (తపాలఖర్చు వేరు)

RAJ JYOTISHI Pt. DEV DUTT SHASTRI TANTRIK, (C.G.M.) JULLUNDUR CITY, E. PUNJAB.